**ఆ యింట్లో ఆయన చావు కోసం పదకొండు మంది ఎదురు చూస్తున్నారు ఆశగా**

**ఆ యింట్లో ఆయన్ని చంపాలని తొమ్మిది మంది సమయం కోసం ఎదురు చూస్తున్నారు ఆత్రంగా.**

ఇంతా ఆయన చేసిన తప్పేమిటంటే ఒక్క మాటలో ఎవరూ చెప్పలేరు. ఆయన ఎవరికీ శత్రువు కాదు. ఆయన చావు కోసం ఆయన్ని హత్య చేయాలని చూసేది, ఆయనగారి తాలూకు బీరకాయపీచు చుట్టాలే.

# అంతిమ రహస్యం

## కురుమద్దాలి విజయలక్ష్మి

ఆయనపేరు ఉగ్రనరసింహప్పగారు. ఆ పేరు ఆయనకి పెట్టటానికి కారణం ఆయన యింకా సేపటికి పుడతాడనగా ఆయన బామ్మకి కలలో ఉగ్రనరసింహమూర్తి మరీ ఉగ్రంగా ఉరిమి చూస్తూ ప్రత్యక్షమై 'నీ మనవడికి నా పేరు పెట్టకపోతే విరుచుకు తింటా'నన్నాడుట. ఆమెకి గబుక్కున మెలుకువ రావటం ఈయన దబుక్కున భూమిమీద పడటం ఏక కాలంలో జరిగింది. అది గతం!

ఉగ్రనరసింహప్పకి ఇప్పుడు తొంభై ఒక్క ఏళ్ళు. ఇంకా చెవులు, కళ్ళు చక్కగా పనిచేస్తున్నాయి. గళం విప్పితే వురిమినట్లే వుంటుంది. పిల్లలు లేరు. పెళ్ళాం ఎప్పుడో పోయింది. లంకంత కొంప. లకారాల ఆస్తి వుంది. రొక్కం గాక వెండి బంగారాలు కిలోల కొద్దీ ఆ ఇంట్లో వుందని జగమెరిగిన సత్యం. అయితే ఇది ఇనప్పెట్టెలో లేదు. ఏమూల పాతేశాడో ఆయనగారికి మాత్రమే ఎరుక.

బతికున్న రోజుల్లో ఆయన ఒక్క చుట్టం చచ్చినాడినీ పిలిచి పిడికెడు అన్నం పెట్టింది లేదు. బతికున్న రోజుల్లో అంటే ఇప్పుడు ఆయన చచ్చారని అర్థం వస్తుంది. బతికున్న రోజులంటే బాగున్న రోజులని కూడా అర్థం వస్తుంది. కాబట్టి ఆ రోజుల్లో సంగతి అది. ఆ ఇంటిమీద కాకి వాలటానికి వీలులేదు. పిల్లి దూరటానికి వీలులేదు. ఏ చుట్టంముండా కొడుకు ఇహ చూరుపట్టుకు వేలాడుతాడు?

అక్కడికీ కొందరు మహానుభావులు పైకి చేరారు. 'బాబాయ్! నేను తప్ప నీకు వెనకా ముందూ ఎవరున్నారు! మా ఇంటికి రా. ఆరాధ్యదైవంగా చూసుకుంటామని" ఒకరు "తాతయ్యా! పెద్ద దిక్కుగా మా ఇంట్లో వుండు. నీ ఆస్తి వద్దు. నీ చేత్తో యివతలి పుల్లతీసి అవతల పెట్టక్కరలేదు. ఈ వయసులో కాలు నొచ్చేను. వేలు నొచ్చేను" అని మరొకరు. ఇలా చాలా మంది ముందు జాగ్రత్త పడ్డారు.

ఉగ్రనరసింహప్ప ఉగ్రనరసింహావతారం ఎత్తి.... "ముం.... నా కొడుకుల్లారా! గాడ్దె కొడుకుల్లారా! ఒక అమ్మ అబ్బకి పుట్టని కుంత నా కొడుకుల్లారా!" అంటూ చేతికర్ర తిరగేసేసరికి తిరిగి చూడకుండా అదే పోత పోయారు. 'ఆయనది నోరు కాదు పెంట దిబ్బ. ఆయన బుద్ధి తెలిసికూడా మనం వెళ్ళడం ఏమిటి?' అని లాగి చెంపకాయ కొట్టుకున్నారు ఎవరికి వారే.

అన్ని రోజులు ఒకేలాగా ఎవరికీ వుండవు.

తొంభై ఒక్కేళ్ళ దాకా ఆయన పని ఆయన మహారాజులాగా చేసుకు తిరుగుతున్న మహానుభావుడికి హఠాత్తుగా హార్ట్ ఎటాక్ వచ్చింది. దానితో చచ్చే దావ యిందిగాని చావలేదు. మరోసారి హార్ట్ ఎటాక్ రావచ్చునని, అప్పుడు యిహ బతికి బట్టకట్టే పని వుండదని, ముందు జాగ్రత్త వహించమని, పూర్తి రెస్ట్ తీసుకోమని, వీలునామాలాంటివి రాయదల్చుకుంటే రాయటం మంచిదని డాక్టరుగారు చెప్పారు. ఏనాడూ జ్వరం చీది ఎరుగని ఉక్కుపిడిలాంటి ఉగ్రనరసింహప్పగారి కర్మకాపోతే హఠాత్తుగా ఈ మాయ [ఏరి] రోగం ఏమిటి? మంచం రెస్టు ఏమిటి?

బీరకాయ పీచులాంటి చుట్టాలందరికీ ఉత్తరాలు వెళ్ళాయి. తిరుగు టపాలో పిల్లా మేకలతో, పెళ్ళాం బిడ్డలతో బిలబిలలాడుతూ చుట్టాలొచ్చి దిగారు. నిజం చెప్పాలంటే వాళ్ళెవరికీ వరసా వాయా తెలియదు. ఒకళ్ళు తాతయ్యా అంటే, మరొకళ్ళు బాబాయి అంటూ వాళ్ళే తోచిన వరస కలిపి మా ఇంటికి రమ్మంటే మా యింటికి రమ్మని బతిమలాడారు. "నా ఇంటిలో తప్ప నేనెక్కడా చావదల్చుకో లేదు. చచ్చినా కదిలేది లేదు పొమ్మన్నాడు" దాంతో చచ్చినట్లు ఆయన చచ్చిందాకా ఆ ఇంట్లోనే కాపురం పెట్టదల్చుకుని ఆఫీసులకి రెండేసి నెలలు శెలవు పారేసి మకాం అక్కడే పెట్టారు వారి వారి ఫామిలీలతో.

అంతా కలిసి ఇరవై మంది వున్నారు. ఏదో ఒక రకంగా ఉగ్రనరసింహప్పకి వాళ్ళంతా చుట్టాలే. ఆయన చుట్టూ చేరి భజన చేస్తున్నారు. ఆయన అడుగులకి మడుగులొత్తుతున్నారు. లోలోపల ఆయన ఎప్పుడు చస్తాడా అని చూస్తున్నారు.

గిర్రున నెల తిరిగింది. ఆయనకి మళ్ళా హార్ట్ ఎటాక్ రాలేదు. యిలా

ఎన్నాళ్ళు ఎదురు తెన్నులు చూడాలో చుట్టాలకి అర్థం కాలేదు. పోనీ పెట్టాబేశా సర్దుకుని వెళదామా అంటే. అటు వెళ్ళంగానే ఈయన ఇటు చస్తే గోల్డెన్ ఛాన్సు పోయినట్లే కదా? పైగా ఒక ఫామిలీ వెళితే తమకి సగం అడ్డు తీరినట్లు ఆనందించి మరో ఫామిలీ అక్కడే తగలబడి ఆయన ఆస్తిమొత్తంరాయించుకుంటే! అమ్మో. కోటి రూపాయల లాటరీ టిక్కెట్టు మీద ప్రథమ బహుమతి అంకెలు మొదటి నుంచి అయిదంకెలు సరిపోయి ఆరో అంకె మారిన విధంగా. అంతకన్నా గొప్ప దరిద్రం మరొకటి వుంటుందా? అందుకే ఎవరూ కదల దల్చుకోలేదు.

ఉగ్రనరసింహప్ప మంచం దిగకుండా హాయిగా రెస్ట్ తీసుకుంటున్నాడు. "జిలేబీ వేడి వేడిది కావాలి. జీడిపప్పు పంచదార పాకం కావాలి అది కావాలి ఇది కావాలి" అంటూ వాళ్ళ సొమ్ముతో తెప్పించుకుని తింటున్నాడు. ఆయనకి తన చేతి పైసా ఖర్చు పెట్టడం ఎంత అయిష్టమో యితరులకి వదిలించడం అంత మహాయిష్టం. ఏళ్ళు తియ్యగా కబుర్లు చెబుతుంటేఆయన అంతకన్నా తియ్యగా మాటలు చెబుతున్నాడు. అంతమంది ఒకచోట చేరేసరికి ఆ యిల్లు పెళ్ళి ఇల్లులా కళకళలాడి పోతున్నది.

ఉగ్రనరసింహప్ప హాయిగా తినడం కబుర్లు చెప్పటమేగాక మరో పని కూడా చేస్తున్నాడు. ప్రతి ఉదయం డాక్టరు చూసి వెళుతున్నాడు. ప్రతి సాయంత్రం ప్లీడరు వచ్చి వెళుతున్నాడు. ప్రతి రోజూ వీలునామా రాస్తున్నాడు. ఆ క్రితం రోజు ఎవరి మీదనయినా కినుక వహిస్తే ఈరోజు రాసే వీలునామాలో వాళ్ళ పేరు కొట్టేయటం జరుగుతున్నది. అదంతా ఆయన ఆస్తి.ఆయన ఇష్టం. ప్రతిరోజూ వీలునామా రాస్తాడు. గంటకొకటి రాస్తాడు. పులిసిన జిలేబీ తెచ్చినందుకు ఆ తెచ్చినాయన పేరు ఆ రోజు వీలునామాలో తొలగించాడు.

ఆయన ఎంతకీ చావకపోవటం చచ్చే చావయింది అందరికి. మొత్తం వచ్చిన చుట్టాల ఇరవై మందిలో పదకొండు మంది ఆయన చావుకోసం గోతికింద నక్కల్లా కాచుకూర్చుంటే వాళ్ళలో తొమ్మిది మంది ధైర్యస్తులు ఆయన్ని చంపాలని సమయంకోసం ఎదురు చూస్తున్నారు. ఆయన్ని చంపటం అంత తేలిగ్గ అయ్యేపని కాదు.ఏ అర్ధరాత్రో ఆయన్ని చంపుదామంటే ఆయన మంచం పక్కనే అహర్నిశలూ ఆయనకి కాపలా కాస్తూ రామభక్తుడిలా ఆయన నౌకరు వుంటాడు. అదీగాక దీనిలో మరో కష్టం వుంది. చంపిం తర్వాత హత్యానేరం మీద పడుతుందని కాదు. ఉగ్రనరసింహప్ప రోజూ వీలునామా మార్చి కొత్తది రాస్తున్నాడు. ఒకరి పేర వీలునామా రాసినప్పుడు పొరపాటున యింకొకడు చంపి పుణ్యం కట్టుకుంటే ఆస్తి రాకపోగా హత్య చేసి మరొకడి సుఖం చూడటానికా? ప్లీడరు రాంగానే ఆ గది గోడలకి చెవులాని స్తారు అందరూ. వాళ్ళ ఒకరి ఇద్దరి పేర్లు వినపడతాయి. ఆ తర్వాత మాటలు

## శబ్దసంధ్య



నిశ్శబ్దాన్ని నిద్ర లేపుతున్నట్లు
నా చీకటి కిటికీలోంచి ఒకటి. అర
వెలుగు పిలుపులు....

తీరా రెప్పల తెరిచి. తరచిచూస్తే ఆ
పిలుపుకు శబ్దం వుంది-సౌందర్యం లేదు!
ఆర్తివుంది-అర్థం లేదు.
పిల్లనగ్రోవి మీద గొడ్డలివ్రేటు పడితే
వెక్కివెక్కి ఏడుస్తూ ఆ చిన్నికళ్ళ కన్నీటి
చప్పుళ్ళో విన్పించే శివరంజని ధ్వని....

నది గుండెను రెండుగా చీలుస్తూ
సాగిపోయే నావకేసి అసహాయంగా చూస్తూ
నదీ గర్భంలో గొంతును పెంచే చేపలఅరుపులు!
అవి-నాకు వినిపించిన నిశ్శబ్ద శబ్దాలు—

—మధునా....మూర్తి



వినపడవు.ఆ రోజు కొత్త వీలునామాలో వాళ్ళ పేరు చేర్చినట్లా? లేక వున్నపేరు పీకేసినట్లా?

ఇదో పెద్ద సస్పెన్స్. టెన్షన్ భరించ లేక పోతున్నారు.

ఆ యింట్లో ఆయన చావు కోసం పదకొండు మంది ఎదురు చూస్తు ్నరు ఆశగా.

ఆ యింట్లో ఆయన్ని చంపాలని తొమ్మిది మంది సమయం కోసం ఎదురు చూస్తున్నారు ఆత్రంగా.

'టప్' మని ఒక్క చరుపుతో రెండు దోమల్ని చంపాడు పుణ్య మూర్తి.

"ఆ .. దోమల్ని చీమల్ని చంపాల్సిందే. శివం పూనినప్పుడు మాత్రం చంపుతా. వక్కవేటుతో చంపుతా అని ఎగిరెగిరి పడటం చాతవు. మనం వచ్చి నెల దాటింది. ఆ ముండా కొడుకు చచ్చింది లేదు. యిచ్చింది లేదు. మన చేతి గుల వదులుతున్నదంతే" కంచికామాక్షి తగ్గ స్వరంతో సాధించింది.

"సమయం రానీ చంపుతా!" అంటూ మహో దోమని చంపాడు పుణ్యమూర్తి.

పుణ్యమూర్తికి చ ;పటం మాచెడ్డ సరదా చిన్న చిన్న జీవుల్ని తప్ప పెద్ద ప్రాణాన్ని ఎప్పుడూ చంపలేదు ఉగ్రనరసింహప్పని చంపి పారేద్దామని మా చెడ్డ సరదా పడుతున్నాడు గాని వీలునామాలోకి తనపేరు ఎక్కిందో లేదోయింకా తెలిసి చావలేదు.


"కొంప చూస్తే లంకంత వుంది. దోమలు ఎలుకలు బొద్దింకలు సాలీళ్ళు భూతగృహంలా వుంది. యింతింట్లో పిశాచంలా వక్కడూ ఎలా వుండేవాడో!" కంచికామాక్షి వాపోయింది.

"ఆయన పేరే ఉగ్రనరసింహప్ప. యింక భయం ఏమిటి? వెండి బంగారాలు ఏ మూలన్నా దాచాడేమో పగలు పని చేస్తున్నప్పుడు గాలిస్తుంటు దక్కినమ్మకి బొక్కెడు అన్నట్లు ఆ దొరికిందాంతోనే తృప్తిపడి ఝండా ఎత్తేద్దాం." అన్నాడు పుణ్యమూర్తి.

"మరి చంపుతానన్నారు?" ఎద్దేవా చేస్తూ అంది కంచికామాక్షి.

"సమయం రానీ చంపుతా!" పాతపాటే పాడాడు పుణ్యమూర్తి.

ఆ లంకంత కొంపలో తలో ఫామిలీ తలో గది పంచుకుని కాపురం పెట్టారు. రాత్రిళ్ళు మాత్రమే చర్చలు సమావేశాలు. పథకాలు ఏ అడ్డంకి లేకుండా సాగేవి. రాత్రి పన్నెండు, ఒంటి గంటవరకు ఎవరికీ నిద్రపట్టదు. ప్రతి గదిలోంచి గుస



గుసలు బైలుదేరి ఎప్పటికో ఆగుసగుసలు ఆగిపోతాయి. భయంకర నిశ్శబ్దం. గాఢాంధకారం. దూరంగా కీచురాళ్ళ ధ్వని. ఉండి ఉండి ఏ మూలనుంచో కొన్ని జీవరాసులు చేసే చిరు శబ్దం. కొందరు గుర్రు పెట్టే ధ్వని. ఎలుకలు బొద్దింకలు వీర విహారం. ఓ పక్క అసువులు బాసిన దోమాగ్రేసరులు. మరో పక్క పీకలదాకా రక్తం పట్టించి జోగుతున్న దోమ సామ్రాజ్యం. ఇద్దరు మనుషులని కలుపుతూ సాలీడు కొత్త గృహం నిర్మిస్తున్నది. ఇది రోజూ దిన చర్యలో రాత్రి చర్య.

"అరె చిన్నాడా! ఇవాళ నువ్వేం కని పెట్టావురా!" అమ్మాయమ్మ కొడుక్కి దగ్గిరగా జరిగి అడిగింది.

"నిశిరాత్రి కారునలుపు లాంటి కాటుక రంగు చీకటి. ఆ మానవ పిశాచం ఆఖరి క్షణాలు దగ్గర పడ్డాయి." అన్నాడు శాంత రౌద్ర గంభీర స్వరంతో చిన్నాడు.

"అట్టా మాట్లాడితే నాకర్థం కాదురా చిన్నాడా! నేనేం పుస్తకాలు చదివానా చచ్చానా? ఆ మాయ ముండా కొడుకు నిన్ను నా కడుపున పడేసి చచ్చాడా! ఆ రోజులగాయితు వంటలు చేస్తూ, వడియాలు, అప్పడాలు పెడుతూ నిన్నింతటి వాడిని చేశాను గాని వెనకేం వేయలేకపోయానురా చిన్నాడా! ఈ చచ్చినాడు ఏదైనా యిస్తాడని ఆశపడి కూడబెట్టుకున్న నాలుగు డబ్బులతో యిక్కడ కాపురం పెడితిమి. చచ్చినాడు తొందరగా అన్నా చావడు." అమ్మాయమ్మ మెటికె విరుస్తూ అంది.




చిన్నాడనే చిన్నవాడికి దగ్గర దగ్గర యిరవై ఏళ్ళున్నాయి. తెలుగు గాక యింగ్లీషు ముక్కలు వచ్చు. ఎద్దులా ఎదిగాడు గాని బుర్రలో గుంజు మాత్రం గుప్పెడు మించి పెరగలేదు. అద్దె పుస్తకాల షాపుల పోషక మహారాజు. రోజుకు నాలుగు పావలాలు పారేసి నాలుగు శవ సాహిత్యాలు తెచ్చి ఎటు జక్ వరకు చదువుతాడు. గొప్ప తెలివి తేటలు రావటానికే ఆ పుస్తకాలు అంత శ్రద్ధా భక్తులతో చదువుతాడని అమ్మాయమ్మ అచంచల విశ్వాసం. చిన్నాడు పుస్తకాల భాష మాట్లాడుతుంటే మురిసి పోతుంది. అప్పుడప్పుడు చిన్నాడు పరిశోధన కూడా చేస్తుంటాడు. మినపప్పు మెత్తగా రుబ్బి గారెలు వండుతారు. పకటి రెండు బద్దలు ఆ పిండిలో వుండి గారెల్లో వుడకగా చిన్నాడు చూశాడు. మినపప్పు పప్పుగావున్నా వుడుకుతుంది. కష్టపడి రుబ్బనేలా! మినపప్పునే గారెగా చరిచి నూనెలో వేస్తే గారెలుగా వుడకవా! కాలవా! రుబ్బటమనే చాదస్తమేల" అని చిన్నాడు పరిశోధనగా ఆలోచించాడు. యింకా అలా గారెలు ఎప్పుడూ వండి చూడలేదు.

"కనిపెట్టాను అమ్మా! అందరిలో ఓర్పు నశించింది. ఎవరోవకరు అప్ప పీక పిసకటం ఖాయం. నేను మరొకటి కూడా కనిపెట్టాను అమ్మా! ఈ మాయా మహోత్తర గృహ సౌధంబులో, ఓహో ఈ భాష నీకు కఠిన తరముగా వుండును కదా. సరిగ చెప్పెద. ఈ యింట్లో కొన్ని గోడల మీద వేలితో కొడితే బోలుగా శబ్దం వస్తున్నది. ఈ గృహ యజమాని పాపి చిరాయువుగాడు, గోడలో వెండి బంగారం పెట్టెలు కదురహస్యంగా దాచివుంచాడు."

అమ్మాయమ్మ అమాంతం లేచి కూర్చుంది. "నిజమేరా చిన్నాడా!" ఆత్రంగా అడిగింది.

"అనుమానమేలనే అమ్మా! కిక్కాళగేళ అనే పుస్తకంలో అంగళ పింగళేశ్వరుడు అనేవాడు గుప్తనిధుల గురించి. అలా ధనం దాచేవారి మనస్తత్వం గురించి వెయ్యి పేజీలు రాశాడు. దానిని నేనేనాడో బట్టీ పట్టాను. మన త్రాష్టుడు అప్పకూడా వెండి బంగారు దిమ్మెలు గోడల్లో రహస్యపు టరల్లో దాచి వుంటాడు."



"ఓయమ్మో! వెండి బంగారు దిమ్మెలే. నక్క దిమ్మెదాబురా మన దరిద్రం తీర టానికి. పది దిమ్మలు దొరికితే చెప్పేదే లేదు. నీవు రాజు కొడుకవే అయిపోతావు. చిన్నాడా! యింతకీ ఆ దిమ్మలెలాగురా గోడలోంచి తీయటం?" "రేపటి నుంచీ మనం రాత్రిళ్ళు నిద్ర మానేసి గోడలకి చిన్నపాటిరంధ్రాలుచేసి రంధ్రాన్వేషణలో పడదాం." అన్నాడు చిన్నాడు చాలా సీరియస్‌గా.

అమ్మాయమ్మ కళ్ళముందు ఇటిక బిళ్ళల సైజులో వెండి బంగారు దిమ్మలు కనపడ్డాయి. ఆ రాత్రి కలలో ఆ దిమ్మె లతో కట్టిన భవనం స్వర్ణ కాంతులు విర జిమ్ముతూ కనపడింది.

మరో గదిలో కాపురం పెట్టిన సాకేత మూర్తి. పెళ్ళాం రుద్రరాణి. ఆ మె తమ్ముడు జోగినాథం. తగ్గు స్వరంతో చర్చించు కుంటున్నారు. ఓ చేతబడిచేసి అన్నా బైమ్‌కి ప్రాణాలు తీసే చ ఛా ఛి అన్న పేరుగల చాతబదేశ్వరుడిని కల్సు కుని వాడి చేతులు ?డిపి తమపనిచెప్పారు.

"కుంటి కుక్క కుడికాలుబొమిక, నల్ల తుమ్మజిగురు బెరడు, అప్పుడే పుట్టిన పిల్లాడి మూత్రం అరఔన్సు. ఆడదాని తల మీదవి మాత్రమే గల వెంట్రుకల తుట్టె ఆ తుట్టెకి సమాన బరువుగల గద్ద గోళ్ళు. తాజా పిల్లి మూత్రం (వెంటనే సీసాలో పోసి గట్టిగా బిరడా బిగించాలి) ఉగ్రనర సింహప్పగారి ఎడమ కాలి చిటికెన వేలి చిన్న గోరు" ఇలా ఓ లిస్టు రాసిచ్చాడు చఛాఛి.

సాకేతమూర్తి, రుద్రరాణి, జోగినాథం చచ్చిచెడి అన్నీ సంపాదించారు. ఓపిల్లిని కూడా పట్టారు. రహస్యంగా వాళ్ళ గదిలో గోతాంలో దాచారు. దాని నోట్లో గుడ్డలు కుక్కి గోతాంలోదాయటంవల్ల భయంతో అది ఓసారి గోతాన్ని తడిపేసి స్పృహ తప్పి అలా వుండి పోయింది. దాని డొక్కలు ఎగిరెగిరి పడటంచూసి. అది బతికే వుందని సంతోషించి దాన్ని వెడల్పు పాటి ప్లాస్టిక్ టబ్‌లో వుంచారు. పారిపోకుండా మెడకో తాడు కట్టారు. [టబ్‌లో మూత్రం పోస్తే పిల్లిని వదిలేసి వెంటనే ఆ మూత్రాన్ని సీసాలోపోసి సీలు చేద్దా మని వీళ్ళ ప్లాను] నోట్లో గుడ్డలు కుక్కి వుండటం వల్ల పిల్లి గింజుకుంది. గాని మియ్యావ్ అనలేదు. పైగా ఒక బొట్టు కూడా రాల్చలేదు. "పిల్లి గుణంనాకుతెల్సు కదా అది అరిస్తేగాని ఉచ్చొయ్యదు" సాకేతమూర్తి అన్నాడు. "మీతెలివితెల్లారి నట్టే వుంది ఆ మాట యింతాలిస్యంగానా చెప్పేది" అని పిల్లి నోట్లో గుడ్డలు లాగే సింది రుద్రరాణి. మత్తుమందు యివ్వ కుండానే పొట్టకోసి పెద్దాపరేషన్ చేస్తున్న రోగిఎలా పెద బొబ్బలు పెడతాడో అలా పెద బొబ్బలు మ్యావ్ మియావ్ అంటూ పిల్లి భాషలో పిల్లి పెట్టింది.

"అరవకే అమ్మా! నీ కాళ్ళు పట్టు కుంటాను. నీ మెడకో బంగారు గొలుసు చేయిస్తాను. మా ఇల వేల్పుగా తలచి పూజిస్తాను. పాలు వెన్న కిలోలు కిలోలు పెడతాను." అని పిల్లి వెనుక కాళ్ళు పట్టు కుని బతిమ లాడింది రుద్రరాణి.

చెవి కోసిన మేకలా అరిచి, నిప్పు తొక్కిన కోతిలా ఎగిరెగిరి పడింది గాని ఆ మార్జాల మహాతల్లి ఒక బొట్టుకూడా విదల్చలేదు. "దాని చేత నీళ్ళు తాగిస్తే ఆపై అదేపంపు వదులుతుంది." అన్నాడు జోగినాథం.

పిల్లి ముందు గ్లాసునిండా నీళ్ళుపెట్టారు. పచ్చి గంగని కూడా ముట్టనని వ్రతం చేస్తున్న మహా పతివ్రతలా ముఖం తిప్పు కుంది పిల్లితల్లి. గుర్రాన్ని గాటిదాకా లాక్కెళ్ళగలం గాని దాని చేత గడ్డి తిని పించలేం కదా! పిల్లయినా అంతే మరి! పిల్లినోటికానించి నీళ్ళు పెట్టారు. బల వంతానా తనచేత విషం తాగిస్తున్నారను కుందేమో మూతి బిగించుకుని వుండి పోయింది. ఇహ యిదిపని కాదని జోగి నాథం సలహా మీద అదో పక్క రక్కు తున్నా భరించి జాగ్రత్త వహించి తన కాళ్ళ మీద వెల్లికితలా పసి పాపను పడుకోబెట్టినట్టు పిల్లి తల్లిని పడుకోబెట్టు కుంది రుద్రరాణి. పిల్లి కాళ్ళను గట్టిగా పట్టుకున్నాడు జోగినాథం పిల్లి నోటి కడ్డంగా స్కేలు పెట్టి చెంచాతో నీళ్ళు తీసుకుని, పాపాయి నోట్లో పాలు పోసి

## ఆకలి

ఆకలైతే చాలు
నాలో ఆలోచనల్ని
ఆహారంగా భావించి
వాస్తవాన్ని నా కన్నులతో
తిలకిస్తూ వూరుకుంటా
ఆకల్ని మరచిపోవాలని!
కాని,
అవమానాల్ని అవహేళల్నీ
విసుగునీ, నిస్పృహనీ,
ఇంకా సంఘ విద్రోహ చర్యల్నీ
అలా-ఇంకెన్నిటినో,
మర్చిపోగలుగుతున్నాను గానీ,
నన్నొదలని, నే మరువని
నేస్తమయి వుండిపోయిందీ ఆకలి!

—'శారదా దేవి'

## లోక రీతి

నేను పయనిస్తున్న
ఈ లోకమనే దారిలో
చూడరానివి చూసి
నా కనులు మేఘాలై వర్షిస్తూ
సెలయేళ్ళలాగా పారుతుంటే
నా భావాల్ని పదవగా
నా కలాన్ని తెడ్డుగా
మార్చుకుంటేగానీ
నా పయనం సరిగా సాగదేమో!

—చిన్ని

నట్లు నీళ్ళుపోయటం మొదలు పెట్టాడు సాకేతమూర్తి.

ఈ పిల్లి అరుపులు విని వాళ్ళ వాళ్ళ గదులలోంచి అందరూ వచ్చి తలుపులు తట్టడం అరవడం చేశారు. లోపల నుంచి సమాధానంగా మ్యావ్ మ్యావ్‌లు తప్ప మరేం వినిపించలేదు. బలవంతానా అర గ్లాసు నీళ్ళు పిల్లిచేత తాగించడం, ఆతర్వాత అది నీళ్ళ మహత్యమో. భయం వల్లనో వీళ్ళ కోరిక తీర్చటంతో నెమ్మదిగా తలుపు తెరచి పిల్లిని బైటకు వదిలారు. అది ఒక్క దూకు దూకి. బైట వాళ్ళమీద పడటం వాళ్ళంతా ఒకరి మీద ఒకరు కంగారుగా అరుస్తూ పడటం లాంటిది అయిపోయింతరువాత వాళ్ళంతా మూకు మ్మడిగా గదిలో దూరారు. "పిల్లి అరుస్తుంటే మీరేం చేస్తున్నారు? గదంతా యిలా గలీజు అయిందేమిటి? పిల్లి రక్కుతుంటే మాటా పలుకూ లేకుండా ఎలా రక్కించుకున్నారు?" అంటూ యక్ష ప్రశ్నలేశారు. "పిల్లి పాదాలకు పూజ చేశాం." వ్యంగ్యంగా సమాధానమిచ్చింది రుద్రరాణి కొంత వాదన జరిగిన తరువాత వీళ్ళని అనుమానంగా చూస్తూ వాళ్ళంతా ఎవరిగదిలోకి వారు వెళ్ళిపోబోతూ ఉగ్రనరసింహప్ప గదిలోకి వచ్చారు.

వీళ్ళూవాళ్ళూ వాదించుకుంటున్నప్పుడు అక్కడున్న ఒకశాల్తీ మెల్లగా ఉగ్రనరశింహప్ప గదిలోకి వెళ్ళి ఆయన ముఖాన దిండు అదిమి పట్టి ఆయన గిలగిల కొట్టుకొని హరీ అన్న తర్వాత పిల్లిలా బైటకి వచ్చి మళ్ళీవీళ్ళలో కలిసిపోవటం జరిగింది.

ఉగ్రనరశింహప్ప కష్టైనుచూసి అందరూ కోరస్‌గా ఆయనొక్క రాగం అలా పించారు. "ఆ పిల్లి అరుపులు ఆపరా, లేకపోతే నా గుండె ఆగేటట్లు వుందని అయ్యగారు చెప్పారయ్యా! నే యిలా వచ్చాను. ఆయన అలా పోయారు. నేను పక్కన వుంటే ఇంత అఘాయిత్యం దాపువచ్చేది కాదు. ఆ పిల్లి అరుపు ఒకటి" అంటూ నౌకరు ఏడుస్తూ చెప్పాడు.

డాక్టరు వచ్చాడు. తీవ్రంగా హార్ట్ ఎటాక్ రావడం వల్ల మరణం సంభవించిందని చెప్పాడు. లాయరు వచ్చాడు. ఉగ్రనరశింహప్పగారికి ఆస్తిపాస్తులు లేనందువల్ల ఎవరి పేరా రాయలేదని చెప్పాడు. ఆ మాటవినిఅందరూ అవాక్కయ్యారు. నౌకరు అయితే ఏకంగా మూర్ఛపోయాడు అప్పులు తీర్చటానికి ఉగ్రనరశింహప్పగారు ఇల్లు అమ్మి. ఆ క్యాష్‌తో అప్పులు తీర్చానని తన తదనంతరం ఇల్లు యింట్లో పాత్ర సామాను[ఫలానాఫలానా] కొన్నఅతనికిఅప్పగించాలనివీలునామాలో వుంది.

చుట్టాలు తిట్టుకుంటూ ఆ నిమిషాన్నే ప్రయాణం అయ్యారు. నౌకరుకి పిచ్చి ఎత్తటంతో వాడూ వెళ్ళి పోయాడు. లాయరు డాక్టరు కలిసి ఉగ్రనరశింహప్ప శవాన్ని అగ్నికి ఆహుతి చేసి ఆ బూడిదని [బ్రతికి వుండగానే ఆయన నిర్మించుకున్న సమాధి] చుట్టూ చల్లారు. అంతటితో ఆయన చాప్టర్ క్లోజ్ అయింది.

ఉగ్రనరశింహప్పగారికి హార్ట్ఎటాక్ ఎప్పుడైతే వచ్చిందో ఆనాడే ఆయన పది అడుగుల స్థలంలో తనకోసం చక్కటి సమాధి కట్టించుకున్నారు. ఇల్లు అమ్మి క్యాష్ చేసుకున్నాడు. అప్పుడు చుట్టాలకి టెలిగ్రామ్‌లు వెళ్ళాయి. నౌకరికి తల నొప్పికి నల్లమందు మాత్ర యివ్వటంతో వాడు మొద్దు నిద్రపోవటంతో ఇంట్లోవున్న వెండి బంగారాలు క్యాష్ అన్నీకూడా రాత్రికి రాత్రి సమాధి కింద గొయ్యితవ్వి ఆ గోతిలో భద్రపరచటం జరిగింది. ఈ పని రెండో కంటికి తెలియకుండా ఉగ్రనరశింహప్పగారే చేశారు.

ఉగ్రనరశింహప్పగారే కాదు. ఆయన లాంటి పిల్లికి బిచ్చం పెట్టని పీనాసి శిఖామణులు వాళ్ళు తినరు, యింకొకళ్ళుతింటే చూడలేరు. పీనాసుల కథలన్నీ యించుమించు అన్నీ యిలాగే వుంటాయి.

ఉగ్రనరశింహప్ప ఆస్తిలో చిల్లి కానీ కూడాపోకుండా బతికుండీ ఆయనేతిన్నాడు, చచ్చీ ఆయన బూడిదే తింటున్నది. కాపోతే ఆయన ఆస్తి ఎవరికి తెలియకుండా ఎలా నేల పాలయింది. అలాగే ఆయన హత్య కూడా రెండో కంటికి తెలియకుండా పోయింది. ఆస్తి కోసమే హత్య జరిగింది.

హత్య చేసింది ఎవరు?

హంతకుడు ఎవరు?

కాస్త వూహిస్తే ఎవరికైనా తెలుస్తుంది. తెలీక పోతే....

ఆరోజు సాయంత్రం ఉగ్రనరశింహప్ప తననౌకరుకి చెప్పాడు. "ఒరేయ్! ఈ చుట్టాలంతా నా చావు కోసం చూస్తూ పడితింటానికి వచ్చారు. నీవలాకాదురా, నేను బాగా కనిపెట్టి చూశాను. నీవొక్కడివే నన్ను కనిపెట్టుకుని ప్రేమగా చూస్తూ వున్నవాడివి. ఈ రోజు నా యిల్లు నీపేర రాయించాను. ఈ విషయం మూడోకంటికి తెలియకూడదు." అనిచెప్పాడు. అదీ ఆయన చావుకి దారి తీసింది. ఉగ్రనరశింహప్ప బుద్ధి తెలిసిన నౌకరు సమయం సద్వినియోగం చేసుకుంటూ ఆ రాత్రి ఆయన ముఖాన దిండు అదిమి హత్య చేశాడు. తన సేవకి ప్రతిఫలం పైసా దక్కకపోవటం. ఒక మనిషిని హత్య చేసాననే పాప భయంతో నౌకరుకి పిచ్చి ఎత్తింది. తెలివికల పాఠకులకు ఈ సరికి అర్థమయే వుంటుంది. ఇంతటిదానికి భేతాళుడే దిగి వచ్చి సమాధానం చెప్పక్కర లేదు.

[అంకితం అంటూ యిస్తే ఉగ్రనరశింహప్పగారి లాంటి తెలివిగల పిసినారికి మాత్రమే యివ్వాలి. కనుక ఈ కథవారికే అంకితం.]

